శుక్రవారం ఉదయం 10 గంటలైనా ఆదిలాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు వెళ్లే జాతీయ రహదారిపై కమ్ముకున్న పొగమంచు

పొగమంచు కౌగిలి.. వణికిస్తున్న చలిపులి

- తెలంగాణ పల్లెలను కమ్మేసిన మంచుతెరలు
- ఉదయం 10 గంటలైనా తొలగని మబ్బులు
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు

నమస్తేతెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, డిసెంబర్ 8: అసలే శీతాకాలం.. దానికి మిగ్‌జాం తుఫాను తోడై తెలంగాణ పల్లెలపై దట్టమైన పొగమంచు కమ్ముకున్నది. నాలుగురోజులుగా చీకటిపోయి పగలు వచ్చినా మంచు మబ్బులు తొలగడంలేదు. చీకటి తెరలను చీల్చుతూ.. శరీరానికి వెచ్చదనాన్ని ఇచ్చే సూర్యకిరణాలు రాకపోవడంతో.. చలిపులి పంజా విసురుతున్నది. ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. జీవరాశులన్నీ వణుకుతున్నాయి. శుక్రవారం ఉదయం 10 గంటలు దాటినా రోడ్లపై మంచు తగ్గకపోవడంతో హైదరాబాద్ నగరంతోపాటు ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో జాతీయరహదారులపై వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని వెళ్లడం కనిపించింది. రోజంతా పొగమంచు కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు చేసుకునేందుకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. మొన్నటి వరకు ఎండాకాలమా? శీతాకాలమా? అని తెలియని పరిస్థితి ఉంటే.. ఇప్పుడు ఒక్కసారిగా వాతావరణం మారిపోయి పగటి ఉష్ణోగ్రతలు 14-13 డిగ్రీలకు పడిపోతున్నాయి. చలి తీవ్రతను తట్టుకోలేక వృద్ధులు, చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

వందకు ఏడుగురే మహిళా డ్రైవర్లు

6.8 శాతం మందికే డ్రైవింగ్ లైసెన్స్.. మణిపూర్‌లో అత్యధికంగా 27%

- రెండు, మూడు స్థానాల్లో గోవా, కేరళ
- ఏటికేడు పెరుగుతున్న లైసెన్స్‌లు

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): దేశంలో అన్ని రంగాల్లో మహిళలు ముందుంటున్నా వాహనాలు నడిపే విషయంలో మాత్రం ఇంకా ఎంతో మెరుగుపడాల్సి ఉన్నది. దేశంలోని మహిళల్లో కేవలం 6.8 శాతం మందికే డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నట్టు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే ప్రతి వంద మందిలో ఏడుగురికే డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నదన్నమాట. ఈ జాబితాలో మణిపూర్ మెరుగ్గా ఉన్నది. అక్కడ ప్రతి వంద మందిలో 27 మందికి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నది. గోవాలో ప్రతి 25 మందికి లైసెన్స్ ఉన్నదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కేరళలో ప్రతి వంద మంది మహిళలకు 20 మందికి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నట్టు గణాంకాలు చెప్తున్నాయి.

- దేశ రాజధాని ఢిల్లీలో కేవలం 7.1% మంది మహిళలే వాహనాలను నడపగలరట.
- అత్యల్పంగా మహారాష్ట్రలో 2 శాతం మంది మహిళలకే డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నట్టు నివేదిక వెల్లడించింది.
- తెలంగాణలో ప్రతి వంద మంది మహిళల్లో ఏడుగురికే డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నదట.

- దేశవ్యాప్తంగా ఉన్న పురుష, మహిళా డ్రైవర్ల సంఖ్యను పరిశీలించినప్పుడు.. మొత్తం లైసెన్స్‌డ్ డ్రైవర్లలో 11 శాతం మంది మహిళలు ఉన్నట్టు నివేదికలు చెప్తున్నాయి.

పెరుగుతున్న సంఖ్య

ఏటికేడు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుంటున్న మహిళల సంఖ్య పెరుగుతున్నది. 2020లో దేశవ్యాప్తంగా దాదాపు కోటి మందికి డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇవ్వగా.. అందులో 15 లక్షల మంది మహిళలు ఉన్నారు. 2022లో ఆ సంఖ్య భారీగా పెరిగింది. కేరళ ప్రభుత్వం 11 లక్షల మందికి లర్నింగ్ లైసెన్స్‌లు జారీ చేయగా.. ఇందులో 40 శాతం మంది మహిళలే ఉన్నట్టు ఆ రాష్ట్ర రవాణా శాఖ వెల్లడించింది. ఇది దేశంలోనే అత్యధికం. గోవాలో లర్నింగ్ లైసెన్స్ పొందినవారిలో 33 శాతం మంది మహిళలే కాగా, చండీగఢ్ (30 శాతం), పుదుచ్చేరి (29.5 శాతం), లక్షద్వీప్ (25 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అతి తక్కువగా బీహార్‌లో 3.82 శాతం మంది మాత్రమే లర్నింగ్ లైసెన్స్ పొందారు.

మహిళా డ్రైవర్లే సేఫ్

పురుషులతో పోల్చితే మహిళల డ్రైవింగే సురక్షితమని ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు అంగీకరిస్తున్నాయి. ఇందుకు అనేక కారణాలు చెప్తున్నారు. ఏపీ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఓ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2019-22 మధ్య హైవేలపై ప్రమాదాల్లో 14,217 మంది డ్రైవర్లు మరణించారు. ఇందులో 462 మంది మాత్రమే మహిళలు ఉన్నారు. సర్వేల ప్రకారం.. పురుషుల వేగంతో పోల్చితే మహిళలు 12 శాతం తక్కువ స్పీడ్‌తో వాహనాలను నడుపుతారట. అత్యధిక ప్రమాదాలు ఓవర్‌టేక్ చేసే సమయంలోనే జరుగుతుంటాయి. అయితే మహిళలు తక్కువగా ఓవర్‌టేక్ చేస్తారట. ట్రాఫిక్ ఉల్లంఘనల విషయంలోనూ మహిళల సంఖ్య తక్కువ ఉన్నట్టు రాష్ట్రాల గణాంకాలు చెప్తున్నాయి. ట్రాఫిక్ నిబంధనల ప్రకారమే వారు డ్రైవింగ్ చేస్తారని, అనవసరంగా రిస్క్ తీసుకోవడం ఎందుకని ఆలోచిస్తుంటారని నివేదికలు చెప్తున్నాయి.

ఐదు రాష్ట్రాల్లో 78 మంది మహిళా ఎమ్మెల్యేలు

- ఛత్తీస్‌గఢ్‌లో అత్యధికంగా 19 మంది సభ్యులు
- తెలంగాణలో ఈసారి పదిమంది

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సహ 5 రాష్ట్రాల శాసనసభలకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో మొత్తం 78 మంది మహిళలు ఎన్నికయ్యారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, మిజోరం అసెంబ్లీల్లో మహిళా ఎమ్మెల్యేల సంఖ్య స్వల్పంగా పెరగగా.. రాజస్థాన్‌లో తగ్గినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మొత్తం 90 స్థానాలున్న ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి 2018లో కేవలం 13 మంది మహిళలు ఎన్నికవగా.. ఇప్పుడు ఆ సంఖ్య 19కి (14 నుంచి 21 శాతానికి) పెరిగింది. ఇది ఆ రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలోనే అత్యధికం. 119 సీట్లున్న తెలంగాణ అసెంబ్లీలో మహిళల సంఖ్య 6 నుంచి 10కి, మధ్యప్రదేశ్ (మొత్తం 230 సీట్లు)లో 21 నుంచి 27కు, మిజోరం (మొత్తం 40 సీట్లు)లో ఒకటి నుంచి రెండు పెరిగింది. కానీ, మొత్తం 200 సీట్లున్న రాజస్థాన్ అసెంబ్లీలో మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య 24 నుంచి ఇరవైకి తగ్గింది. వాస్తవానికి రాజస్థాన్ అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేల సంఖ్య ఎప్పుడూ 15 శాతానికి మించలేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

పెద్దలే అధికం

తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీల్లో ఎమ్మెల్యేల సగటు వయస్సు గతంతో పోల్చితే మరింత పెరిగింది. తెలంగాణ కొత్త శాసనసభలో ఎమ్మెల్యేల సగటు వయసు 56 ఏండ్లుగా ఉన్నది. మన రాష్ట్రంలో 55 ఏండ్లు పైబడిన ఎమ్మెల్యేల నిష్పత్తి 2018లో 39 శాతం ఉండగా.. ఈసారి ఆ నిష్పత్తి 60 శాతానికి పెరిగింది. మధ్యప్రదేశ్ నూతన అసెంబ్లీలో 50% మంది ఎమ్మెల్యేలు 55 ఏండ్లు పైబడినవారే. ఆ శాసనసభలో 55 ఏండ్లు పైబడినవారు 2008లో 21% మంది, 2013లో 30% మంది, 2018లో 38% మంది ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ కొత్త అసెంబ్లీలో 55 ఏండ్లు పైబడిన ఎమ్మెల్యేల నిష్పత్తి 41 శాతంగా ఉన్నది. 2008లో ఈ నిష్పత్తి 16 శాతం, 2013లో 29 శాతం, 2018లో 40 శాతంగా ఉన్నది. కానీ, రాజస్థాన్ శాసనసభలో ఈసారి 55 ఏండ్ల కంటే ఎక్కువ వయసున్న ఎమ్మెల్యేల నిష్పత్తి 48 నుంచి 46 శాతానికి తగ్గడం గమనార్హం.

రౌడీషీటర్ ఖైసర్‌పై ఈడీ కేసు

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ హబీబ్‌నగర్‌కు చెందిన రౌడీషీటర్ ఖైసర్ 'పహిల్వాన్'పై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) దాఖలైంది. అతనిపై విచారణ ప్రారంభించాలని హైదరాబాద్ పోలీసులు.. ఈడీకి లేఖ రాశారు. హైదరాబాద్ సీపీ సందీప్ శాండిల్య దర్యాప్తు ప్రారంభించి, పలు క్రిమినల్ కేసుల్లో ప్రమేయం ఉన్నట్టు గుర్తించారు. అక్రమంగా భారీగా ఆస్తు లు కూడబెట్టాడని, భూకబ్జాలు, దోపి డీ తదితర 22 క్రిమినల్ కేసుల్లో ఇతడి ప్రమేయం ఉన్నదని, తన అక్రమ కార్యకలాపాలతో దాదాపు రూ.100 కోట్ల వరకు సంపాదించినట్టు తెలిపా రు. 2011లో నగర బహిష్కరణ త ర్వాత, మళ్లీ హైదరాబాద్‌కు వచ్చి, నేర కార్యకలాపాలు ప్రారంభించాడు. 2014లో పీడీ చట్టం కింద ఖైసర్‌ను నిర్బంధించి చర్లపల్లి జైలులో ఉంచారు.

పారిశ్రామికవర్గాల్లో ఉత్కంఠ

- ప్రభుత్వం మారిన నేపథ్యంలో సర్వత్రా నెలకొన్న ఆసక్తి
- నిరంతర విద్యుత్తు, పారిశ్రామిక విధానాలే కీలకం
- విశ్వాసం సన్నగిల్లకుండా చూడాలంటున్న పరిశ్రమ వర్గాలు

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటవుతున్న నేపథ్యంలో పారిశ్రామికరంగం భవిష్యత్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. కొత్త ప్రభుత్వం నూతన విధానాలను ప్రవేశపెడుతుందా? ప్రస్తుత విధానాలనే కొనసాగిస్తుందా? అనే చర్చ పారిశ్రామికవర్గాల్లో జరుగుతున్నది. రాష్ట్రానికి ఉన్న భౌగోళిక అనుకూలతలకు తోడు కొత్తగా వచ్చే ప్రభుత్వం కూడా పారిశ్రామిక అనుకూల విధానాలను కొనసాగిస్తే పారిశ్రామిక ప్రగతికి ఢోకా ఉండదనేది పలువురి అభిప్రాయం. వ్యవసాయరంగం తరువాత అత్యధికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేది పారిశ్రామికరంగం. వివిధ పన్నుల ద్వారా రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయాన్ని సమకూర్చేది కూడా ఈ రంగమే. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరించిన పారిశ్రామిక అనుకూల విధానాలు, 24 గంటల నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు తోడు ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రిగా కేటీఆర్ పనితీరు పారిశ్రామికరంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించాయి. సులభతర అనుమతుల కోసం టీఎస్-ఐపాస్ చట్టం తేవడంతోపాటు ఐటీ, ఔషధాలు, టెక్స్‌టైల్స్, ఆహారశుద్ధి, ఈవీ, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ తదితర రంగాల్లో అనుసరించిన విధానాలు భారీస్థాయిలో పెట్టుబడులను ఆకర్షించాయి. తైవాన్, ఫ్రాన్స్, జపాన్, జర్మనీ, అమెరికా తదితర దేశాలకు చెందిన సంస్థలు హైదరాబాద్ శివార్లలో పరిశ్రమలను నెలకొల్పాయి. ముఖ్యంగా ఐటీ రంగంలో బెంగళూరు నగరాన్ని హైదరాబాద్ అధిగమించింది.

ప్రభుత్వంతో చర్చలకు పారిశ్రామికవర్గాల సన్నాహాలు

కరోనా అనంతరం విదేశీ సంస్థలు చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌పై ఆసక్తి ప్రదర్శిస్తున్న పరిశ్రమలను తెలంగాణకు వచ్చే విధంగా కేటీఆర్ తీవ్రంగా కృషిచేశారు. వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలకు దీటుగా రాయితీలను కల్పించడంతోపాటు వారిలో విశ్వాసం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. నిర్ణయాలు తీసుకోవడంలో స్వతంత్రంగా వ్యవహరించడంతో పెట్టుబడిదారులు సైతం ఎప్పటికప్పుడు తమ సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేవారు. కొత్త ప్రభుత్వం సైతం సానుకూల దృక్పథంతో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తే రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఢోకా ఉండదని పారిశ్రామికవర్గాలు భావిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ముఖ్యమంత్రిని, పరిశ్రమల శాఖ మంత్రిని కలిసి చర్చించే యోచనలో పారిశ్రామికవర్గాలు ఉన్నాయి. రాష్ట్రంలో కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు, ప్రస్తుతం ఉన్న పరిశ్రమలు సజావుగా కొనసాగేందుకు తీసుకోవాల్సిన చర్యలను ప్రభుత్వానికి వివరించాలని భావిస్తున్నట్టు సమాచారం.

వరంగల్ జిల్లా నల్లబెల్లిలోని గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన మహిళలు

కేవైసీ కోసం వెళ్లి.. లోబీపీతో కుప్పకూలి

వృద్ధురాలి ప్రాణం మీదకు తెచ్చిన గ్యాస్ కేవైసీ పుకార్లు

నల్లబెల్లి, డిసెంబర్ 8 : వంట గ్యాస్ కేవైసీ పుకార్లు ఓ వృద్ధురాలి ప్రాణం మీదకు తెచ్చాయి. గ్యాస్ కనెక్షన్ ఉన్న వినియోగదారులు కేవైసీ చేయించుకోవాలనే నిబంధన చాలా రోజులుగా ఉన్నా దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడంలో సదరు గ్యాస్ ఏజెన్సీ పూర్తిగా విఫలమైంది. తాము అధికారంలోకి వస్తే రూ. 500లకే గ్యాస్ బండను పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో వినియోగదారులు కేవైసీ చేయించుకోవాలనే పుకార్లు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలవ్యాప్తంగా వ్యాపించాయి. దీంతో శుక్రవారం ఉదయం 7 గంటలకే మహిళలు, వృద్ధులు మండల కేంద్రంలోని సదరు గ్యాస్ ఏజెన్సీ వద్దకు చేరుకుని క్యూలైన్లో బారులు తీరారు. గంటల తరబడి క్యూలో నిల్చున్న గొల్లపల్లెకు చెందిన 70 ఏండ్ల వృద్ధురాలు సల్పాల సమ్మక్క లోబీపీతో పడిపోయింది. గ్యాస్ ఏజెన్సీ వారు స్పందించకపోవడంతో తోటి మహిళలు సమీపంలోని ఓ ప్రైవేట్ వైద్యుడి వద్దకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ఈ ఘటనపై మహిళలు, మండల ప్రజలు గ్యాస్ ఏజెన్సీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవైసీపై గ్యాస్ ఏజెన్సీ వారితోపాటు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని వారు కోరుతున్నారు.

వృద్ధురాలికి చికిత్స అందిస్తున్న వైద్యుడు

'మైనంపల్లినే ఓడిస్తారా? మీ అంతుచూస్తాం'

- బీఆర్‌ఎస్ నేతలు, కార్పొరేటర్లకు బెదిరింపు ఫోన్లు
- ఎమ్మెల్యే మర్రి మొబైల్ నంబర్ నుంచి వచ్చినట్టుగా ఫోన్ కాల్
- రాచకొండ సీపీకి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఫిర్యాదు

నేరేడ్‌మెట్, డిసెంబర్ 8: 'మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావునే ఓడిస్తారా? మీ అంతు చూస్తాం' అంటూ గుర్తుతెలియని వ్యక్తులు బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ల భర్తలను, నాయకులను ఫోన్ల ద్వారా బెదిరిస్తున్నారని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. తన మొబైల్ నంబర్ డిస్‌ప్లే అయ్యేలా సదరు వ్యక్తులు టెక్నాలజీని వినియోగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సదరు వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆయన మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులతో కలిసి రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు ఫిర్యాదు చేశారు. గౌతమ్‌నగర్ కార్పొరేటర్ భర్త మేకల రాముయాదవ్, నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ భర్త ఉపేందర్‌రెడ్డి, జవహర్‌నగర్ కార్పొరేటర్ మురుగేశ్, మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, మౌలాలి మాజీ కార్పొరేటర్ భర్త అమీనుద్దీన్, అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన ఇద్దరు అనుచరులకు మూడు రోజులుగా బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఎమ్మెల్యే మర్రి పేర్కొన్నారు. వీరంతా మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, అల్వాల్ పోలీస్‌స్టేషన్లలోనూ ఫిర్యాదు చేసినట్టు ఆయన సీపీ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

శుక్రవారం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్‌కు ఫిర్యాదు చేస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ రమాదేవి

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

- గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినుల డిమాండ్
- ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 8: బూరుగూడలోని గిరిజన గుకురుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ దివ్యరాణి తమపట్ల వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని, ఆమెను వెంటనే సస్పెండ్ చేయాలని ఆ కళాశాల విద్యార్థులు శుక్రవారం ఆసిఫాబాద్ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను ప్రిన్సిపాల్ మానసికంగా వేధిస్తున్నారని, వెంటనే ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపటికి డీడీ రమాదేవి, సంబంధిత అధికారులు అక్కడికి చేరుకొని విద్యార్థులను సముదాయించారు. అయినా విద్యార్థులు వినకపోవడంతో అధికారులు డిగ్రీ కళాశాలల అసిస్టెంట్ సెక్రటరీతో ఫోన్‌లో మాట్లాడి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ సంబంధిత శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

'శ్రీమంతుడు' దర్శకుడిది కాపీరైట్ ఉల్లంఘన

- దీనిపై విచారణను ఎదుర్కోవాలి
- కొరటాల కేసులో హైకోర్టు తీర్పు
- నిర్మాత, ఇతరులపై కేసు కొట్టివేత

హైదరాబాద్, డిసెంబర్ 8, (నమస్తే తెలంగాణ): శ్రీమంతుడు సినిమా కాపీ రైట్స్ వ్యవహారంపై దాఖలైన కేసులో హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఫోర్జరీ, మోసం అభియోగాలకు ఆధారాల్లేవని తేల్చి చెప్పింది. వీటిపై కేసు కొనసాగింపు చెల్లదని చెప్పింది. దర్శకుడు, రచయిత కాపీరైట్ ఉల్లంఘన కేసు విచారణను ఎదుర్కోవాలని న్యాయమూర్తి జస్టిస్ కే సురేందర్ తీర్పు చెప్పారు. ఎనిమిది మంది రచయితల కమిటీ నవల కాపీ అని తేల్చిందని గుర్తుచేశారు. అంతమాత్రాన అది మోసం, ఫోర్జరీ కిందికి రాదని స్పష్టం చేశారు. కోట్లాది రూపాయలు వెచ్చించి చిత్రాన్ని నిర్మించడంతోపాటు, కథ, రచన, స్క్రీన్‌ప్లేకు కూడా దర్శకుడే సొమ్ము చెల్లించినందున ఆయనే బాధ్యత వహించాలని చెప్పారు. నిర్మాతలపై కేసును కొనసాగించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఎర్నేని నవీన్, మహేశ్‌బాబు ఎంటర్‌టైన్‌మెంట్‌పై ఉన్న కేసులను కూడా కొట్టివేశారు.

'చచ్చేంత ప్రేమ' నవలా రచయిత ఫిర్యాదు

చచ్చేంత ప్రేమ.. పేరిట తాను రాసిన నవలను శ్రీమంతుడు పేరుతో సినిమాను చిత్రీకరించి, కథ, రచయితగా మరొకరిని పేర్కొనడంపై దర్శకుడు కొరటాల శివ, నిర్మాతలు ఎర్నేని రవి, మహేశ్‌బాబు ఎంటర్‌టైన్‌మెంట్‌పై రచయిత శరత్ చంద్ర అలియాస్ ఆర్‌డీ విల్సన్ క్రిమినల్ కేసు పెట్టారు. ఆ కేసును కొట్టేయాలని వారంతా వేర్వేరుగా కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఇదే సమయంలో వారిపై ఫోర్జరీ, చీటింగ్ కేసుల నమోదుకు ఉత్తర్వులు ఇవ్వాలని శరత్‌చంద్ర పిటిషన్ వేశారు. వీటన్నింటినీ కలిపి హైకోర్టు విచారించింది. ప్రధాన కథలో కొద్దిగా మార్పులు చేసి సినిమా తీసి సొంత కథ అని చెప్పడానికి వీల్లేదని న్యాయమూర్తి చెప్పారు. రచయితల కమిటీ నిర్ణయం ప్రకారం కూడా ఇది కాపీరైట్ ఉల్లంఘన పరిధిలోకి వస్తుందని తీర్పులో స్పష్టం చేశారు. నిర్మాతపై కేసును మాత్రం కొట్టివేశారు. అదేవిధంగా ఫోర్జరీ, మోసం కూడా అవుతుందన్న విల్సన్ పిటిషన్‌నూ కొట్టేశారు. దర్శకుడు కాపీ రైట్స్ యాక్ట్ కింద విచారణను ఎదుర్కోక తప్పదని న్యాయమూర్తి తేల్చి చెప్పారు.

ఎలక్ట్రిక్ బండెక్కి వచ్చేత్తపా!

- రాష్ట్రంలో విద్యుత్తు వాహనాల జోరు
- ఏటికేటికీ పెరుగుతున్న వినియోగదారుల ఆసక్తి
- 50 వేలకు చేరువలో స్కూటర్లు, కార్లు

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) జోరు కొనసాగుతున్నది. సంప్రదాయ ఇంధనాలకు భిన్నంగా వినియోగదారులు ఎలక్ట్రిక్ వాహనాలపై మక్కువ చూపుతున్నారు. దీంతో ఈ ఏడాది నవంబర్ వరకు ఈవీల సంఖ్య 46,000 దాటిపోయింది. ఇందులో 8,000 పైచిలుకు కార్లు కాగా, మిగిలినవి స్కూటర్లు, బైక్‌లు ఉన్నాయి. గత రెండేండ్లుగా ఏటా 18 నుంచి 20 వేల వాహనాల పెరుగుదల చోటు చేసుకుంటుండటంతో త్వరలోనే ఈవీల సంఖ్య 50 వేలు దాటిపోయే అవకాశం ఉన్నది. 2020లో రాష్ట్ర ప్రభుత్వం ఈవీ పాలసీ (2020-2023)ని ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి రాష్ట్రంలో ఈవీల విక్రయాల్లో పెరుగుదల గణనీయంగా కనిపించింది. ఈవీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలతో చాలామంది ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈవీ పాలసీ కింద 2 లక్షల ద్విచక్ర వాహనాలు, 5,000 ఈ-కార్లకు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి 100 శాతం మినహాయింపు ఇస్తున్నారు. టీఎస్‌ఆర్టీసీ కూడా క్రమంగా బస్సుల స్థానంలో ఈ-బస్సులను ప్రవేశపెట్టాలని సంకల్పించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1,000 ఈ-బస్సులను ప్రవేశపెట్టాలని, 2025 నాటికి వీటి సంఖ్యను 3,500కు పెంచాలనే లక్ష్యంతో ముందుకు

సాగుతున్నది. ఇప్పటికే మొదటి విడుతలో 50 బస్సులను ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో పెరుగుతున్న ఈవీలకు తగ్గట్టుగా టీఎస్ రెడ్కో సైతం బ్యాటరీ చార్జింగ్ స్టేషన్ల వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నది. ప్రస్తుతం రాష్ట్రంలో 150 చార్జింగ్ కేంద్రాలు ఉండగా, త్వరలోనే వీటి సంఖ్యను 200కు చేర్చాలని రెడ్కో లక్ష్యంగా పెట్టుకున్నది.

దేశవ్యాప్తంగానూ భారీగా ఈవీల అమ్మకాలు

దేశవ్యాప్తంగానూ ఈవీల విక్రయాల జోరు కొనసాగుతున్నది. ఇప్పటివరకు దేశంలో 23,37,761 ఈవీల విక్రయాలు జరిగినట్టు జేఎంకే రీసెర్చ్ సంస్థ తెలిపింది. ప్రస్తుత ఏడాదే 12 లక్షలకు పైగా వాహనాలు అమ్ముడైనట్టు వెల్లడించింది. ఇందులో 60 శాతం వాటా ద్విచక్ర వాహనాలది కాగా, ప్యాసింజర్ 3 వీలర్ వాటా 29 శాతం. మిగిలిన వాటా కార్లది. ఈ ఏడాది ఈవీల విక్రయాలు సాగించిన టాప్-5 రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్రాలు ఉన్నాయి. 2022తో పోల్చుకుంటే బైక్‌ల విక్రయాలు ఈ ఏడాది 210 శాతం పెరగగా, 3 వీలర్స్, ఇతక కమర్షియల్ వాహనాల విక్రయాలు 126 శాతం పెరిగినట్టు జేఎంకే తెలిపింది. అలాగే, ఎలక్ట్రిక్ కార్ల విక్రయాల్లోనూ 150 శాతం పెరుగుదల నమోదైనట్టు పేర్కొన్నది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ వాహనాల కన్నా ఈవీల ధరలు కనీసం 2-3 లక్షలు అధికంగా ఉన్నాయి. దీంతో కొత్తగా వాహనాలు కొనాలనుకునేవారు వెనుకంజ వేస్తున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు పెట్టే ఆ డబ్బేదో పెట్రోల్‌కు పెట్టవచ్చని ఆలోచిస్తున్నారు. అయితే, రానున్న రోజుల్లో బ్యాటరీల తయారీ టెక్నాలజీ మరింత పెరిగి, ధరలు తగ్గితే ఈవీల వైపు మొగ్గు చూపొచ్చని వినియోగదారులు ఆలోచిస్తున్నారు.

తెలుగోళ్లు లావైపోతున్నారు!

- ఏపీ, తెలంగాణలో పెరుగుతున్న స్థూలకాయుల సంఖ్య
- జాతీయ పోషకాహార సంస్థ అధ్యయనం వెల్లడి
- ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులే కారణమని స్పష్టీకరణ

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు శరీరంలో అనవసరపు కొవ్వులకు కారణం అవుతున్నాయి. దాని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల ప్రజలు స్థూలకాయంతో బాధపడుతున్నారు. ఈ మేరకు జాతీయ పోషకాహార సంస్థ తాజా అధ్యయనంలో వెల్లడించింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన 10 వేలకు మంది జీవనశైలి, ఆహారపు అలవాట్లను అధ్యయనం చేసిన పరిశోధకులు.. వృద్ధ కొవ్వులతోనే ఒబెసిటీ పెరుగుతున్నదని తేల్చారు. హైదరాబాద్‌తో పాటు, కొన్ని పట్టణాలు, ఏపీలోని కొన్ని పట్టణాల్లో క్రాస్ సెక్షనల్ అధ్యయనం ఆధారంగా ఒబెసిటీ తీవ్రతను పరిశీలించారు. ఇందులో 47 శాతం పట్టణాల్లో, 33 శాతం గ్రామీణ ప్రాంతాల్లో, 20 శాతం ఆరోగ్య స్థితిగతుల ఆధారంగా స్థూలకాయం ఉన్నదని వెల్లడించారు. వీరిలో హైపర్ టెన్షన్, అధిక బరువు, డయాబెటిస్ వంటి లక్షణాలు కూడా ఉన్నాయని తేలింది. పరిశోధకుడు సమరసింహారెడ్డి ఈ అధ్యయనానికి నేతృత్వం వహించారు.

వయోజనుల్లోనే ఎక్కువ

35 ఏండ్ల వయసు పైబడిన వారిలోనే స్థూలకాయం లక్షణాలు ఉన్నాయని పరిశోధనలో తేలగా, ఆహారపు అలవాట్లలో మార్పులే ఇందుకు కారణమని వెల్లడించారు. మెజార్టీ ప్రజలకు ఆహార సమతుల్యతపై అవగాహన లేదని, అందుకే అధిక బరువు అని గుర్తించారు. పట్టణాల్లో అధిక ఒత్తిడి, మానసిక సమస్యలతో బాధపడుతున్నవారు కూడా ఒబెసిటీకి గురవుతున్నారని తేల్చారు. ఫాస్ట్ ఫుడ్, అధిక చక్కెర, అధిక ఉప్పు కలిగి ఉండే ఇన్‌స్టంట్ వంటకాలతో పిల్లలు కూడా బాధితులేనని స్పష్టం చేశారు. ఆహారపు అలవాట్లను మార్చుకొంటే దీర్ఘకాలిక వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.